సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



ఇన్‌స్పైర్ చేద్దాం రండి
ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వెలికితీసేలా ప్రోత్సహిస్తే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. 8లో



వనం వదిలి.. జనంలోకి..
విశాఖ నగరంలోని కంబాలకొండలో ఉన్న జింకలు తాగునీటి కోసం శనివారం జాతీయ రహదారిపైకి వచ్చేశాయి.



రక్తదానంతో ప్రాణదానం
ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కోరారు. 8లో

న్యూస్‌రీల్

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గోవిందరావు



విశాఖ లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఇ.గోవిందరావు నగరంలోని ప్రధాన మెట్రోపాలిటీ సెషన్ కోర్టు అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావు మాదకద్రవ్యాలు, గంజాయి నిషేధిత మత్తు మందులు వంటి కేసులకు ఏపీపీగా వ్యవహరిస్తారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, పి.నర్సింగరావు, ఉపాధ్యక్షుడు రామ జోగేశ్వరరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లత హర్షం వ్యక్తం చేశారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సునీల్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కిందుగూడలో శనివారం కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కిందుగూడ గ్రామంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడు కె.సునీల్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతనిని తండ్రి డొంబు, కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి వివేక్ వైద్య సేవలు అందించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల పర్యవేక్షణలో వైద్యసేవలందిస్తున్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే పాల్గుణ

- బౌద్ధ మత గురువు మృతికి సంతాపం



పాడెను మోస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మాసాడలో బౌద్ధ మత గురువు గొల్లోరి జీనబంధు మృతికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంతాపం తెలిపారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించారు. బౌద్ధ మత గురువు మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్మశాన వాటిక వరకు పాడి మోశారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు పాల్గొన్నారు.

సమాజంలో మార్పు యువతతోనే సాధ్యం

- పాడేరు ఏఎస్పీ ధీరజ్



మాట్లాడుతున్న ఏఎస్పీ ధీరజ్

అరకులోయ రూరల్: సమాజ మార్పు యువతీ యువకులతోనే సాధ్యమని పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. శనివారం స్థానిక దండకారణ్య జూనియర్ కళాశాలలో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువతీ యువకులు సన్మార్గంలో నడవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, మద్యానికి ఆకర్షితులై జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకార్యలు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యవంతులుగా రాణించాలని కోరారు. సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరులోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



పెదబయలులో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు అర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అడ్డతీగలలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంతబాబు

పేదల ఆశాజ్యోతి వైఎస్సార్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- వాడవాడలా వర్ధంతి
- సేవా కార్యక్రమాలు చేపట్టిన పార్టీ శ్రేణులు



లింగాపుట్టులో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పార్టీ నేతలు

సాక్షి,పాడేరు: పేదల ఆశాజ్యోతి దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులో శనివారం ఆమె ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో గిరిజన ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అదే ఆశయాలతో పాలన సాగిస్తున్నారన్నారు. గిరిజనుల పక్షపాతిగా వినూత్న సంక్షేమ పథకాలను అమలుజేస్తున్నారన్నారు. లింగాపుట్టులో వైఎస్ విగ్రహానికి ఎమ్మెల్యే, పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర,వైస్ ఎంపీపీ కుంతురు కనకాలమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి తమర్భ వెంకటేశ్వరనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు కొట్టగుల్లి కొండాజీ, కొట్టగుల్లి నాగేంద్ర, మహిళా విభాగం నేతలు కోడా సుశీల, ఊర్వశిరాణి, సచివాలయాల మండల కన్వీనర్ కిముడు కోటిబాబు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శివరాత్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన

పేదల సంక్షేమమే లక్ష్యంగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ పాలన సాగించారని ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అన్నారు. ఆయన వర్ధంతిని శనివారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. వంట్లమామిడిలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల హృదయాల్లో దేముడుగా డాక్టర్ వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, వంట్లమామిడి, దేవాపురం సర్పంచ్‌లు రాంబాబు, పరమేశ్వరి, బీఎస్ఎన్ఎల్ సలహా మండలి సభ్యుడు బద్దు సందీప్ పాల్గొన్నారు.

చిరస్థాయిగా..

పెదబయలు: దివంగత మహానేత వైఎస్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉన్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదబయలులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. రాజన్న కలలుగన్న స్వర్ణయుగం ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో వచ్చిందన్నారు. అరడకోట, పెదకోడాపల్లి, లక్ష్మీపేట పంచాయతీల్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు నివాలర్పించారు. వైఎస్సార్ పార్కు నుంచి ప్రధాన రోడ్డు వరకు వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పాలు,రొట్టెలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వి.సన్యాసి, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ నాయకులు గంగాభవాని, వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో దేవుడు

అడ్డతీగల: సంక్షేమ పథకాలతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన వర్ధంతి సందర్భంగా వైఎస్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజల స్వయం సమృద్ధి సాధనకు బాటలు వేశారన్నారు. రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు సామిదాల రాజారమేష్ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

అనాథ ఆశ్రమ చిన్నారులకు భోజనాలు

స్థానిక తలారిసింగి బాలసదనం అనాథ ఆశ్రమంలోని 50 మంది బాలికలకు పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి చికెన్ బిరియాని, ఇతర వంటకాలతో కూడాని భోజనం సమకూర్చారు. పండ్లు అందజేశారు.

పుస్తకాల పెన్నులు పంపిణీ

గుడివాడ అనాథ ఆశ్రమంలోని 50 మంది చిన్నారులకు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు శనివారం సాయంత్రం నోటు పుస్తకాలు,పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ తదితరులు పాల్గొన్నారు.



పెదబయలు పీహెచ్‌సీల్లో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సమకూర్చిన భోజనాలను తింటున్న పాడేరులోని తలారిసింగి అనాథ ఆశ్రమ చిన్నారులు



పాడేరులోని అనాథ ఆశ్రమం చిన్నారులకు పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేసిన రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



అనంతగిరిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, ఆనంద్, తదితరులు

గంజాయి స్థావరంపై దాడులు



గంజాయి, నిందితులతో కొయ్యూరు పోలీసులు



గంజాయి, నిందితులతో అనంతగిరి పోలీసులు

- 300 కిలోల స్వాధీనం
- పది మంది అరెస్టు

కొయ్యూరు: జీడిమామిడి తోటల్లోని గంజాయి స్థావరంపై స్థానిక పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. 300 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అరెస్టు చేశారు. డౌనూరు పంచాయతీ గుమ్మనివానిపాలెంలో తరలించేందుకు గంజాయి సిద్ధంగా ఉందన్న సమాచారం మేరకు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారావు అప్రమత్తమయ్యారు. గంజాయి నిల్వ చేసిన ప్రాంతాన్ని గుర్తించారు. సిబ్బందితో దాడులు నిర్వహించి 300 కిలోలు స్వాధీనం చేసుకుని పదిమందిని అరెస్టు చేశారు. కారు, స్కూటీని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒడిశా నుంచి అడవి మార్గం ద్వారా గంజాయి తీసుకువచ్చి గుమ్మనివానిపాలెంలో నిల్వ చేస్తున్నారని తెలిపారు.ఇక్కడ నుంచి కార్లలో తుని వరకు తరలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. అక్కడ నుంచి ఎవరికి అనుమానం రాకుండా వాహనాల్లో తరలిస్తారని తెలిపారు. ఇలా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. నిందితుల నుంచి ఐదు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసులో గుమ్మనివానిపాలెంకు చెందిన కాకరి దేవరాజు, లేగుల మురళి, పొట్టిక శ్రీనివాస్,కలిదిండి వెంకటేశ్వరరావు, మాతే మహేష్, బద్రి రాంబాబు, డౌనూరుకు చెందిన అక్కపల్లి సుధాకర్, గుమ్మనివానిపాలెంకు చెందిన కాకర సోమరాజు, గెమ్మెల శ్రీనివాస్, నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ దుగ్గాడకు చెందిన నల్లబిల్లి అంజిబాబును అరెస్టు చేశామన్నారు.

అనంతగిరిలో 72 కిలోలు..

అనంతగిరి: కారులోని అక్రమంగా తరలిస్తున్న 72 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కరక రాము తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు వైపు నుంచి వస్తున్న మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కారులో 75 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. కారులో ఉన్న మహారాష్ట్రకు చెందిన విజయ్ అనిల్‌మోహిత్, పూజా విశాల్‌మోహిత్, నాలుగేళ్ల కుమారుడు, బీహార్‌కు చెందిన వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని ఆయన వివరించారు. గంజాయి, కారును సీజ్ చేసినట్టు తెలిపారు. ఒడిశాలోని పాడువకు చెందిన మల్లీ శ్రీను పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

కొబ్బరి సాగుకు ఏజెన్సీ అనుకూలం

- ఉత్పాదకలో రాష్ట్రం ప్రథమస్థానం
- ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్



మాట్లాడుతున్న కొబ్బరి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్



రైతులకు కొబ్బరి మొక్కలు అందజేస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్, లలితాకామేశ్వరి

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతం కొబ్బరి సాగుకు ఎంతో అనుకూలంగా ఉందని కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్ అన్నారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రపంచ కొబ్బరి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, కేవీకే కోఆర్డినేటర్ డా. లలితాకామేశ్వరి, అంబాజీపేట హెచ్ఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్టు ఎన్‌బీవీ చలపతిరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొబ్బరి ఉత్పాదక ఎక్కువగా ఉన్నప్పటికీ విస్తీర్ణం తక్కువగా ఉందన్నారు. ఏజెన్సీలో కొబ్బరి సాగును ప్రోత్సహించేందుకు తొలిసారిగా కేవీకేలో ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహించినట్టు చెప్పారు. ఏజెన్సీలో కొబ్బరి సాగు విస్తీర్ణం పెంచేందుకు గిరిజనుల్లో చైతన్యం తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. దేశంలో కొబ్బరి విస్తీర్ణంలో మన రాష్ట్రం నాలుగో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో హెక్టార్‌కు 16 వేల కొబ్బరి కాయలు ఉత్పాదకత ఉండగా, తమిళనాడులో 11 వేలు మాత్రమే ఉందన్నారు. రానున్న రోజుల్లో ఐటీడీఏ, ఉద్యానవనశాఖ, కేవీకేలతో కలిసి ఏజెన్సీలో కొబ్బరి సాగును ప్రోత్సహించేందుకు పనిచేస్తామన్నారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ఏజెన్సీలో కొబ్బరి అభివృద్ధి సంస్థతో కలిసి పనిచేయడం ద్వారా గిరిజనుల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కొబ్బరిలో తెగుళ్ల నివారణ, విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. రెండేసి కొబ్బరి మొక్కలు చొప్పున 375 మంది రైతులకు అందజేశారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా రైతులకు అందించే రాయితీలు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్తలు డా. రాజేంద్ర ప్రసాద్, వీసీ వెంగయ్య, కేవీకే శాస్త్రవేత్తలు డా. వీరాంజనేయులు, క్రాంతికుమార్, ప్రవీణ్, పీహెచ్‌వో చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూ మినిస్టీరియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం



ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

సాక్షి,పాడేరు: ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి గిరిజన సంక్షేమశాఖ మినిస్టీరియల్ ఉద్యోగులు(బోధనేతర సిబ్బంది)సంఘ నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. స్థానిక పీఎంఆర్‌సీ భవనం ఆవరణలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ ఉద్యోగులంతా సమావేశం నిర్వహించారు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎ.వెంకటరావు (పాడేరు డీడీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్), ఉపాధ్యక్షుడిగా జే.ప్రసన్నకుమార్ (జూనియర్ అసిస్టెంట్,విశాఖ), కార్యదర్శిగా జి.జానకీరామ్ (జేఏ,పాడేరు), సంయుక్త కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు(జేఏ,చిట్టంపాడు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శేషు (జేఏ, జి.మాడుగుల), కోశాధికారులుగా బి.వెంకటలక్ష్మి (జేఏ,తలారిసింగి), కె.హైమావతి (జేఏ,గూడ), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వి.జ్యోతి, ప్రమీలా,ప్రావీణ్య, వెంకటేష్ నియమితులయ్యారు.

క్లుప్తంగా

వాగులో గుర్తు తెలియని మృతదేహం

చింతపల్లి: మండలంలోని అన్నవరం వాగులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ రమణ తెలిపారు. కృష్ణవరం మంగవీధి గ్రామాల మధ్య నుంచి వాగులో మృతదేహం కొట్టుకువచ్చినట్టు భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

బుచ్చన్నదొర కుటుంబానికి అండగా ఉంటాం



బుచ్చన్నదొర కుటంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

దేవీపట్నం: పాముగండి పంచాయతీ సర్పంచ్ కోసు బుచ్చన్నదొర ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని శనివారం సాయంత్రం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు పరామర్శించారు. బుచ్చన్నదొర మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కుంజం మురళీ, కందుల బాబ్జి, కట్టా సత్యనారాయణ, గారపాటి మురళీకృష్ణ, శిరశం పెద్దబ్బాయిదొర, కోసు బాపనమ్మ, పండా రామసీత, కోసు లక్ష్మణ్, గొర్రిల గంగాధర్ , కలుం శ్రీనివాస్, తదితరులున్నారు.

జనావాసాల మధ్య గోవధపై ఫిర్యాదు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్‌కు ఎదురుగా ఓ ఇంట్లో గుట్టుగా సాగుతున్న గోవధపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత కాలంగా ఇక్కడ జనావాసాల మధ్య గోవధ చేయటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ మేరకు పోలీసులు స్వయంగా వెళ్లి వధించిన గోవును పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని టౌన్ పోలీసులు తెలిపారు.

ఇన్‌స్పైర్ చేద్దాం రండి

- కొత్త ప్రయోగాలు,ఆవిష్కరణల వేదిక ఇన్‌స్పైర్ మనక్
- అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు అవకాశం
- యూపీ పాఠశాలలకు 3,హైస్కూల్‌కు 5 ప్రాజెక్ట్ నమూనాలు
- జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిల్లో ప్రోత్సాహకాలు
- ఈనెల 30 వరకూ గడువు
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 1967 నామినేషన్లు



గత ఏడాది రాష్ట్ర స్థాయికి ఎంపికైన నమూనా

అనకాపల్లి రూరల్: ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వెలికితీసేలా ప్రోత్సహిస్తే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. అలాంటి విద్యార్థుల కోసం ఏటా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 2009 నుంచి ఇన్‌స్పైర్ మనక్ పేరిట విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నాయి. చిన్నారుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణల రూపకల్పనలను ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి,నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకోసం జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 30 తుది గడువు కావడంతో పాఠశాలల వారీగా దరఖాస్తు ప్రక్రియపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. 6 నుంచి 10వ తరగతుల వరకు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చు. ప్రతి పాఠశాల నుంచి ఐదు ఉత్తమ ఒరిజినల్ ఆవిష్కరణలు/ఆలోచనలను వెబ్‌సైట్‌లో తుది గడువులోగా అప్‌లోడ్ చేయడానికి అవకాశం కల్పించారు.

జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పోటీలు

నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత మొదట జిల్లా స్థాయిలో పోటీల ప్రదర్శన నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. అక్కడ ఎంపికైతే జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది.ఇలా జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైతే రూ.10వేలు, రాష్ట్ర స్థాయిలో ఎంపికైతే రూ.40 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.60వేలు నగదు బహుమతిని నేరుగా విద్యార్థి అకౌంట్‌లో జమ చేస్తారు.ఈ కసరత్తు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులకు దరఖాస్తులు,ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులకు దరఖాస్తులు తప్పనిసరిగా వచ్చేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని అధికారులు సూచిస్తున్నారు. గత ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి తొమ్మిది ఆవిష్కరణలు ఎంపికయ్యాయి.

ఇన్‌స్పైర్ నామినేషన్లు, ఎంపిక వివరాలు		
సంవత్సరం	నామినేషన్లు	ఉమ్మడి జిల్లాలో ఎంపికైనవి
2017-18	1,216	116
2018-19	4,386	436
2019-20	3,261	319
2020-21	2,657	260
2021-22	2,502	244
2022-23	2,318	203
2023-24	1,967(ఇప్పటివరకు)	

నిబంధనలు ఇవీ..

- ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు.
- ఇంటికి సంబంధించిన లేదా రైతులు,కూలీల సమస్యలైనా,దైనందిన సమస్య ఏదైనా విద్యార్థి దానికి సహజమైన,సృజనాత్మక,నవీన పద్ధతిలో తగిన పరిష్కారం చూపితే నామినేషన్లకు పంపేందుకు వీలుంటుంది.
- డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా,స్వచ్ఛ భారత్,మేక్ ఇన్ ఇండియా,సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించాలి.

దరఖాస్తు విధానం ఇలా..

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో పాల్గొనేందుకు ప్రాజెక్టు వివరాలను పాఠశాల ఐడీ ద్వారా గడువులోపు www.inpireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.విద్యార్థి పాఠశాలకు సంబంధించిన వివరాలను పొందుపరచాలి. విద్యార్థుల దరఖాస్తు సంబంధిత జిల్లాథారిటీకి చేరుతుంది. దరఖాస్తును ఆమోదించిన తర్వాత దరఖాస్తుదారు ఇచ్చిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది.ఆ లింక్‌తో వచ్చిన ఐడీతో పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి.అనంతరం విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి.



నరవ హైస్కూల్‌లో సైన్స్ నమూనాల ప్రదర్శన

భవిష్యత్తులో మంచి అవకాశాలు



అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులు. ప్రతి ఒక్క పాఠశాల నుంచి పోటీలో విద్యార్థులను భాగస్వాములను చేయాలి.వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను,శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసేలా ప్రదర్శనలు రూపొందించి, సకాలంలో నామినేషన్లు దాఖలు చేయించాలి.ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రాజెక్టుల నమోదు అక్‌నాలెడ్జ్‌మెంట్‌లు డీఈవో కార్యాలయాల్లో ఇవ్వాలి. ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్తులో అనేక మంచి అవకాశాలు ఉన్నాయి.ఉన్నత విద్యా సంస్థల్లో ఉచితంగా సీట్లు పొందవచ్చు.

– డాక్టర్ కప్పల ప్రసాద్, ఉమ్మడి జిల్లా సైన్స్ అధికారి

‘రంపచోడవరం’లో 2,69,617 మంది ఓటర్లు

సబ్ కలెక్టర్ శుభం బన్సల్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఏజెన్సీలోని 11 మండలాల్లో 2,69,617 మంది ఓటర్లు ఉన్నారని సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల సవరణ సర్వే పూర్తయిందన్నారు. ఓటు నమోదుకు 803 మంది, పేర్లు తప్పులు, ఫొటోల సవరణకు 1152 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. వై రామవరం మండలం నుంచి వీఆర్ పురం మండలానికి 412 మంది ఓటు బదిలీకి వీఆర్ పురం తహసీల్దార్ లేఖ ఇచ్చారన్నారు. ఓటర్ల జాబితాలో పార్టీ నేతలు తెలియజేసిన సమస్యలపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రక్తదానంతో ప్రాణదానం

- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్
- 80 యూనిట్ల రక్తం సేకరణ

సాక్షి,పాడేరు: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆల్ ఇండియా తౌహిద్ జమాత్ మసీదు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శనివారం రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈశిబిరాన్ని జేసీ ప్రారంభించారు.రక్తదానంకు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగులు, యువతీ, యువకులు ముందుకు రావడంపై ఆయన అభినందనలు తెలిపారు. సుమారు 80 యూనిట్ల మేర రక్తాన్ని సేకరించారు. రక్తదాతల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆల్ ఇండియా తౌహిద్ జమాత్ మసీదుశాఖ ఇప్పటికి 16సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, స్వచ్ఛంద సేవా సంస్థలన్ని రక్తదాన శిబిరాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, పాడేరు, హుకుంపేట ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు సీహెచ్. రమాదేవి, కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆల్ ఇండియా తౌహిద్ జమాత్ మసీదు అధ్యక్షుడు అనీస్ అబూబకర్, ప్రతినిధులు ఇమ్రాన్‌ఖాన్, అబ్దుల్‌బాసి, సయ్యద్ సర్దార్, అమీర్ అలీ, డాక్టర్ రూపకళ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లోహితాసుడు, సూర్యారావు, గౌరీశంకర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా ఎస్‌ఐ అభ్యర్థులకు ముగిసిన పరీక్షలు



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో గత నెల 30న మహిళా అభ్యర్థులకు పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆఖరి రోజున 690 మందికి హాల్‌టికెట్లు పంపగా.. 555 మంది హాజరయ్యారు. వారికి బరువు, ఎత్తు, పరుగు, లాంగ్ జంప్ తదితర పరీక్షలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో మొత్తం 2,745 మందికి గానూ 2,164 మంది హాజరయ్యారు. ఈ నెల 4 నుంచి పురుష అభ్యర్థులకు యథావిధిగా పరీక్షలు కొనసాగుతాయని రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు.

కేంద్ర సహాయ మంత్రి రాక నేడు

మహారాణిపేట: కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్ ఆదివారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు బెంగళూరులో బయలుదేరి.. 7.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 4న ఉదయం 9 గంటలకు పోర్టులో నౌకలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు విశాఖ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

‘ఉన్నతి’తో ఉపాధి అవకాశాలు

ముంచంగిపుట్టు: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసిన వేతనదారుల పిల్లలకు ఉన్నతి ప్రాజెక్టు ద్వారా ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఏపీవో కె.సూరిబాబు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 2018-2023 సంవత్సరాల్లో 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన వేతనదారుల కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచితంగా ఉపాధి శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఈ నెల 6న పెదబయలు మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఎంపికైన వారికి మూడు నెలలు కంప్యూటర్స్, మెకానిక్, ప్లంబింగ్, ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ తదితర కోర్సుల్లో ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇచ్చి, అనంతరం ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో 6వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్‌లో గణనీయ పురోగతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ రంగం ఈ ఆర్థిక సంవత్సరంలో గణనీయమైన పురోగతి కనబరుస్తుంది. ఈ ఆగస్టు నెలలో విలువ ఆధారిత ఉత్పత్తులు గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 1,57,000 టన్నులు అమ్మకాలు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు వ్యవధిలో 5,57,000 టన్నుల విలువ ఆధారిత ఉక్కు అమ్మకాలు చేసి ఇప్పటిదాకా ఈ వ్యవధిలో చేసిన అమ్మకాల కంటే మెరుగైన రికార్డు సాధించింది. ఆగస్టులో 79 వేల టన్నులు వైర్ రాడ్ కాయిల్స్, 1,99,000 టన్నుల రీబార్స్, 46 వేల టన్నులు స్ట్రక్చరల్ ఉత్పత్తులు అమ్మకాలు చేసి గతంలో ఏ ఆగస్టులో లేని విధంగా అత్యుత్తమ విక్రయాలు సాధించింది. ఆగస్టులో రూ. 2,502 కోట్లు అమ్మకాలు చేసి గత ఏడాది ఇదే వ్యవధిలో జరిగిన రూ.1,806 కోట్లు అమ్మకాలు కంటే 39 శాతం వృద్ధిని నమోదు చేసింది. సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి మార్కెటింగ్ సిబ్బందిని అభినందించారు.

ఏలేరు కాల్వలో జారిపడి వృద్ధుడి మృతి

కశింకోట: ఉగ్గినపాలెం వద్ద ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ జారి పడి వృద్ధుడు శనివారం మృతి చెందారు. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు అందించిన వివరాలివి. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన బుదిరెడ్డి కామయ్య శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని తన ఇంటి నుంచి వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెదికారు. గ్రామ సమీపంలో శనివారం ఉదయం ఏలేరు కాలు వ గట్టుపై చెప్పులు ఉండడం, ఈ ప్రాంతంలో కొంత సేపటికి మృతదేహం తేలడంతో వెలికి తీశారు. అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు. ఈ మేరకు భార్య చిలుకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.